క్లుప్తంగా

శ్రీశైలానికి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

కావలి: కార్తీక మాసం సందర్భంగా శ్రీశైలం క్షేత్రానికి కావలి డిపో నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. ఆదివారం ఉదయం 10.30 గంటలకు కావలి నుంచి బస్సు బయలుదేరి సాయంత్రానికి శ్రీశైలానికి చేరుకుంటుందని చెప్పారు. సోమ వారం ఉదయం తిరిగి బయలుదేరి కావలికి చేరుకుంటుందని వివరించారు. ఒక్కో ప్రయాణికుడికి రానుపోను టికెట్ ధర రూ.425 అని తెలిపారు. 7780 సర్వీసు నంబర్ లేదా ఏపీఎస్ఆర్టీసీ వెబ్‌సైట్ లేదా కావలి బస్టాండ్‌లోని రిజర్వేషన్ కౌంటర్‌లో రిజర్వేషన్ చేసుకోవాలని సూచించారు. వివరాలకు, 98498 50498, 99660 09395, 94939 13989 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

కావలి కాలువకు సాగునీరు విడుదల



సంగం: సంగం బ్యారేజ్ నుంచి కావలి కాలువకు సాగునీటిని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి గురువారం విడుదల చేశారు. తొలుత గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కావలి కాలువ పరిధిలోని లక్ష ఎకరాలకు సోమశిల జలాలను అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

ఉపాధ్యాయుడి దాతృత్వం

సోమశిల: అనంతసాగరం మండలం చిలకలమర్రి జెడ్పీ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు గణిత ఉపాధ్యాయుడు చల్లా చంద్రశేఖరరెడ్డి చేయూతనందించారు. 22 మంది పది విద్యార్థులకు సంబంధించిన పరీక్ష ఫీజు మొత్తాన్ని హెచ్‌ఎం సురేష్‌కు శుక్రవారం అందజేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు.

వ్యాసరచన పోటీలు

అనుమసముద్రంపేట: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఠాగూర్ పాఠశాలలోని విద్యార్థులకు శుక్రవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఎస్సై సైదులు ఆధ్వర్యంలో సైబర్ నేరాలను అరికట్టడంలో యువత పాత్ర అనే అంశంపై పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.

ఎరువుల పంపిణీ

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు బోర్డులో 2024–25 పంట కాలానికి సంబంధించి పొగాకు రైతులకు ఎరువుల పంపిణీని డీసీఎంఎస్ జిల్లా బిజినెస్ మేనేజర్ డీ వెంకటస్వామి, పొగాకు బోర్డు క్రాఫ్ కమిటీ సభ్యుడు ఎన్ సుబ్బారావు, పొగాకు వేలం కేంద్రం నిర్వహణాధికారి రాజశేఖర్ శుక్రవారం ప్రారంభించారు. పొగాకు బోర్డు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

చేజర్ల: మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఏవీ రమణారావు ఉద్యోగ విరమణ సభను శుక్రవారం నిర్వహించారు. ఏఎస్‌పేట తహసీల్దార్ రామకృష్ణ, డీటీ మస్తానయ్య, ఏపీఎం సుజన, ఏఓ శశిధర్, విశ్రాంత హెచ్‌ఎం శ్రీనివాసులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేయొద్దని వినతి

ఉదయగిరి: గండిపాళెంలో మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేయొద్దని గ్రామ యువకులు కోరారు. ఈ మేరకు ఉదయగిరి ఎక్సైజ్ సీఐ లక్ష్మణస్వామికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. గత 15 ఏళ్ల నుంచి గ్రామంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయడం లేదని, అంతకుముందు ఉన్నప్పటికీ గ్రామస్తుల ఆందోళనతో రద్దు చేశారని విన్నవించారు. ఇటీవల మద్యం దుకాణాన్ని దక్కించుకుని వ్యక్తి గ్రామంలో ఏర్పాటు చేయాలని చూస్తున్నారని, ఎట్టి పరిస్థితుల్లో తాము అంగీకరించబోమన్నారు. టీడీ పీ, జనసేన, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నిందితుడ్ని వెంటనే అరెస్ట్ చేయాలి

చేజర్ల: గిరిజన మహిళలను లైంగిక వేధింపులకు గురిచేసిన వ్యక్తిని వెంటనే అరెస్ట్ చేయాలని నెల్లూరు నగర మేయర్ పీ స్రవంతి డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం ఆమె యనమదల ఎస్టీ కాలనీకి చెందిన బాధిత మహిళను పరామర్శించి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. నిందితుడు మల్లినేని పెంచలయ్యపై పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే బాధిత మహిళ కుటుంబాన్ని యానాదుల సంక్షేమ సంఘ రాష్ట్రాధ్యక్షుడు కేసీ పెంచలయ్య పరామర్శించారు. నిందితుడిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు కృష్ణవేణి, మురళి, ఉష, సతీష్‌చంద్ర,నాగరాజు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపునకు చర్యలు

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు పట్టణంలోని పంచాయతీ బస్టాండ్ నుంచి బంగ్లా సెంటర్ వరకు రోడ్డు ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఈఓపీఆర్డీ గోపీశ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఆయన రెవెన్యూ, పంచాయతీ అధికారులతో కలిసి ఆక్రమణలను పరిశీలించారు. రెండు , మూడు రోజుల్లో తొలగించాలని, లేకపోతే తామే చర్యలు చేపడుతామని ఆక్రమణదారులకు సూచించారు. ఆయనవెంట ఈఓ శివకుమార్, వీఆర్వోలు రమణయ్య, శిరీష, తదితరులున్నారు.

కార్తీకం.. శుభకరం

నేటి నుంచి కార్తీక మాసం ఆరంభం

- నాలుగు వారాల పాటు నోములు, వ్రతాలు
- దీపాన్ని దైవస్వరూపంగా భావించి పూజలు
- సకల శుభాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం
- ముస్తాబైన శైవ క్షేత్రాలు

'న కార్తీక సమో మాస:' అంటూ కార్తీకంతో సమానమైన మాసం లేదని స్కంద పురాణం చెబుతోంది. ఈ మాసం శివకేశవులకు ఎంతో ప్రీతికరం. అందుకే అన్ని మాసాల కంటే కార్తీక మాసాన్ని హిందువులు ఎంతో పవిత్రంగా భావిస్తారు. ఈ నెల రోజులు దైవభక్తితో ఉంటే ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలు కలుగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ మాసంలో మహిళలు ప్రత్యేకంగా పూజలు, నోమలు, వ్రతాలు ఆచరిస్తారు. కార్తీక మాసంలో దీపారాధనకు ఎంతో ప్రత్యేకత ఉంది. ప్రతి ఇల్లు..ప్రతి గుడి కార్తీక దీప కాంతులతో శోభిల్లుతాయి. శనివారం నుంచి కార్తీక మాసం ప్రారంభం కానుండడంతో అంతటా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.



ముస్తాబైన కావలిలోని శివాలయం



కావలి: ఆకాశ దీపాల కోసం సిద్ధం చేసిన కుండలు



సోమశిలలోని సోమేశ్వరాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు(ఫైల్)

కావలి/ఉదయగిరి/సోమశిల/దుత్తలూరు/సీతారామపురం: కార్తీక మాసానికి శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. శనివారం నుంచి కార్తీక మాసం ప్రారంభంకానుండడంతో కావలి, ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాల్లోని శైవక్షేత్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శైవక్షేత్రాలను దర్శించుకునేందుకు భారీగా తరలివచ్చే భక్తుల కోసం ప్రత్యేకంగా వసతులు కల్పించారు. ఆకాశ దీపాలను వెలిగించేందుకు కుండలను సిద్ధం చేశారు.

- కావలి నియోజకవర్గంలోని కావలి పట్టణంలోని శివాలయం, కావలి మండలం, బోగోలు, దగదర్తి, అల్లూరు మండలాల్లోని శైవక్షేత్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కావలి, బోగోలు, అల్లూరు మండలాల్లోని సముద్ర తీరంలో భక్తులు సముద్రస్నానాలు ఆచరించి దీపారాధనలు చేయనున్నారు.
- ఉదయగిరి నియోజకవర్గంలోని ఉదయగిరిలోని శివపార్వతుల ఆలయం, వింజమూరులోని శివాలయం, చెన్నకేశవస్వామి ఆలయం, సీతారామపురంలోని ఘటిక సిద్దేశ్వరం క్షేత్రం, భైరవకోన క్షేత్రంలో కార్తీక మాస పూజలకు ముస్తాబయ్యాయి. దుత్తలూరులోని ఊరకొండపై కొలువైన రామలింగేశ్వరుడి ఆలయంలో ప్రతి సోమవారం విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించనున్నారు. ఈ నెల 15న కార్తీక దీపోత్సవం, వనభోజనాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.
- సోమశిలలోని కామాక్షి సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో శనివారం నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు కార్తీక మాస ఉత్సవాలు నిర్వహించనున్నారు. క్షేత్రంలో స్వయంభువుగా వెలసియున్న సోమేశ్వరస్వామికి ప్రతిరోజూ విశేషాభిషేకాలు, పూజా కార్యక్రమాలు జరుగుతాయి. ఈ నెల 15న కార్తీక పౌర్ణమి సందర్భంగా కార్తీక దీప దర్శనం కల్పించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు అన్నవరపు రామకృష్ణశర్మ తెలిపారు. కలుగుతుందని, ఉసిరికాయలో దీపం వెలిగిస్తే పాపాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం.

3 నుంచి అఖండ జ్యోతి ఉత్సవాలు

భైరవకోన క్షేత్రం ఈ నెల 3 నుంచి 30వ తేదీ వరకు అఖండ జ్యోతి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు త్రిముఖ దుర్గాంబ భక్త బృంద కమిటీ అధ్యక్షుడు దుగ్గిరాల కోటయ్యస్వామి తెలిపారు. ప్రతి సోమవారం పంచామృతాభిషేకం, విశేషాలంకరణ, కుంకుమార్చన, అఖండ నామార్చన, మహానైవేద్యం నివేదన నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ నెల 15న కార్తీకపౌర్ణమి సందర్భంగా దుర్గాంబ ఆలయంలో కార్తీక జ్యోతి దర్శనం కల్పించనున్నట్లు తెలిపారు.

మున్సిపల్ కమిషనర్ వినూత్న ఆలోచన

- రోడ్డుపై చెత్త వేయకుండా తులసి కోట ఏర్పాటు



తులసి కోటను ఏర్పాటు చేసిన కమిషనర్ శ్రావణ్‌కుమార్

కావలి: పట్టణంలోని పాత శ్రీరామ్ సినిమా హాల్ రోడ్డు నిత్యం ప్రజల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ఈ రోడ్డులోని ఖాళీ ప్రదేశంలో చెత్తను పడేస్తుండడంతో పరిసరాలు దుర్గంధం వెదజల్లుతూ స్థానికులతో పాటు ఆ మార్గంలో రాకపోకలు సాగించే వారు ఇబ్బందులు పడుతున్నారు. చెత్తను పడేయవద్దని మున్సిపల్ సిబ్బంది హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినా ఫలితం లేదు. రాత్రి వేళల్లో చెత్తను పడేస్తున్నారు. చెత్తను తొలగించడంలో పారిశుధ్య కార్మికులు ఏ మాత్రం జాప్యం చేసినా ప్రజలకు ఇబ్బందికరంగా ఉండేది. దీంతో మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ వినూత్నంగా ఆలోచించారు. శుక్రవారం చెత్త వేస్తున్న ప్రదేశాన్ని శుభ్రం చేయించి తులసికోటను ప్రతిష్ఠించారు.

దీపం–2 పథకం ప్రారంభం



మాట్లాడుతున్న మంత్రి ఆనం

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని 13వ వార్డు అరుంధతీయకాలనీలోని అంబేడ్కర్ భవనం వద్ద దీపం–2 పథకాన్ని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. జేసీ కార్తీక్, ఆత్మకూరు ఆర్డీఓ బీ పావని, మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్‌తో కలిసి ఐదు ఇళ్లకు వెళ్లి మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడారు. ఆత్మకూరు నియోజకవర్గంలో 23,313 మందికి ఉచిత గ్యాస్ అందనుందని తెలిపారు. తహసీల్దార్ సుధీర్, మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరమణమ్మ, వైస్‌చైర్మన్ షేక్ సర్దార్, కౌన్సిలర్లు గౌస్‌బాషా, సూరా భాస్కర్‌రెడ్డి, మాదాల శ్రీనివాసులు, టీడీపీ నాయకులు టీ గిరినాయుడు, కే రవీంద్రారెడ్డి, చల్లా రవికుమార్‌రెడ్డి, టీ చంద్రారెడ్డి, పులిమి శైలజ, పిడికిటి వెంకటేశ్వర్లు, ఐవీ రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతలు పూడ్చిన సీనియర్ సిటిజన్లు



ఆత్మకూరురూరల్ / ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణం నుంచి జాతీయ రహదారిపై అభయాంజనేయ స్వామి ఆలయం వరకు ఉన్న బైపాస్ రోడ్డు గుంతలమయమై ప్రమాదకరంగా మారడంతో సీనియర్ సిటిజన్లు శ్రమదానం చేసి గుంతలు పూడ్చారు. దీపావళి పర్వదినం సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయులు కొల్లా వెంకటేశ్వర్లు, వెలిశెట్టి నారాయణరావు, ఆత్మకూరు శాఖ గ్రంథాలయ అధికారి అంకెనపల్లి గోవిందరెడ్డి, ఉపాధ్యాయులు అన్నపురెడ్డి పెద వెంకటరెడ్డి తదితరులు పలుగు, పార చేతబట్టి సమీపంలో ఉన్న మట్టిని సేకరించి గుంతలు పూడ్చారు. వయోభారంతో ఆరోగ్య సమస్యలు ఉన్నప్పటికీ తమ వంతుగా బైపాస్ రోడ్డులో గుంతలు పూడ్చిన సీనియర్ సిటిజన్ల సేవా నిరతిని పలువురు కొనియాడారు. ప్రభుత్వం రోడ్లపై గుంతలు పూడుస్తామంటూ ఇటీవల ప్రచారం చేసుకుంటున్న నేపథ్యంలో ఆ కార్యక్రమాన్ని స్వయంగా చేసి చూపించిన ఆత్మకూరు సీనియర్ సిటిజన్లు ఆదర్శనీయులు అని పలువురు కొనియాడారు.

వాటర్ ట్యాంక్ వితరణ

కావలి: పట్టణంలోని బీసీ బాలికల ప్రభుత్వ వసతి గృహానికి డాక్టర్లు బీ సతీష్ , ఉషారాణి దంపతులు వాటర్ ట్యాంక్‌ను శుక్రవారం వితరణ చేశారు. వాటర్ ట్యాంకు పగిలిపోయి విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నట్లు సంయుక్త సేవా సంస్థ అధ్యక్షుడు సురేంద్ర తమ దృష్టికి తీసుకురావడంతో సమకూర్చామని వారుతెలిపారు. వార్డెన్ విజయలక్ష్మి దాతలకు ధన్యవాదాలు తెలిపారు.

టీడీపీ నేతల వైఖరిపై కూలీల నిరసన

- ఇసుక ట్రాక్టర్ల అడ్డగింత



ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న కూలీలు

సోమశిల: మండల పరిధిలోని పడమటికంభంపాడు ఇసుక రీచ్ వద్ద శుక్రవారం కమ్మవారిపల్లికి చెందిన కూలీలు ఇసుక ట్రాక్టర్లను అడ్డుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పడమటికంభంపాడుకు చెందిన అధికార పార్టీ నేతలు రీచ్‌లో తాము చెప్పినట్లే జరగాలని, తమ గ్రామానికి చెందిన వారే పనిచేయాలని, అదే పంచాయతీకి చెందిన కమ్మవారిపల్లితో పాటు రీచ్ సమీపంలోని సోమశిల గ్రామానికి చెందిన కూలీలను వెనక్కు పంపారని తెలిపారు. తాము అధికార పార్టీకి చెందిన వారిమైనప్పటికీ బెదిరించి వెనక్కు పంపారని వాపోయారు. ఇలా పొట్టకూటి కోసం వచ్చిన కూలీలను బెదిరించడం తగదన్నారు. దీనివల్ల గ్రామాల మధ్యన ఘర్షణలు చోటు చేసుకునే అవకాశం ఉందన్నారు. దీనిపై అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రీచ్‌లో అందరికీ పని కల్పించాలని డిమాండ్ చేశారు.

ఘనంగా ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం



కావలిలో అమరజీవికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి



చేజర్లలో అమరజీవికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం



దుత్తలూరు: తహసీల్దార్ కార్యాలయంలో..

కావలి/దుత్తలూరు/సోమశిల/చేజర్ల: ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కావలిలో అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అమరజీవి తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని నిలబెట్టారని, ఆయన త్యాగ ఫలితంగానే తెలుగు ప్రజల కోసం ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైందని తెలిపారు. కావలి ఆర్యవైశ్య అధ్యక్షుడు తాటవర్తి రమేష్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, కావలి పట్టణాధ్యక్షుడు గుత్తికొండ కిషోర్, ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే దుత్తలూరు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నాగరాజు ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతసాగరంలోని సచివాలయం–1లో అమరజీవి, తెలుగుతల్లి చిత్రపటాలకు పూలమాలలు వేశారు. స్థానిక గ్రంథాలయాధికారి దివానపు నారాయణరావు, వెల్ఫేర్ అసిస్టెంట్ మురళి, వీఆర్వో బాబు పాల్గొన్నారు. చేజర్ల బస్టాండ్ సెంటర్‌లోని అమరజీవి విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం మండలాధ్యక్షుడు పువ్వాడ శ్రీనివాసరావు, నాయకులు కేసీహెచ్ బాబు, అమర్తలూరి ప్రభాకర్‌రావు, బొగ్గవరపు సుధాకర్‌రావు, అమరా సురేంద్ర, డీ లక్ష్మణ్, జీ నాగేశ్వరరావు, ఎం జనార్దన్‌నాయుడు, కమలేష్, శేషయ్యనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అమరజీవి త్యాగం చిరస్మరణీయం

కావలి: అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం చిరస్మరణీయమని మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా అమరజీవి త్యాగాన్ని స్మరించుకుంటూ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలుగు ప్రజల కోసం అమరజీవి చేసిన ప్రాణత్యాగం ఫలితంగానే ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటైందన్నారు. ఆయన త్యాగాన్ని స్మరించుకోవాల్సిన బాధ్యత భావితరాలపైన ఉందన్నారు.

గుడి నిర్మాణం అడ్డగింత

అనుమసముద్రంపేట: మండలంలోని తిమ్మానాయుడుపల్లిలో పోలేరమ్మ ఆలయ నిర్మాణం వివాదాస్పదంగా మారింది. గత కొన్నేళ్లుగా గ్రామంలో పోలేరమ్మ గుడి ఉంది. దాని స్థానంలో కొత్త గుడిని నిర్మించేందుకు గ్రామస్తులు పూనుకున్నారు. అయితే గుడి నిర్మాణం చేపట్టే స్థలం తనదని, అందులో నిర్మాణం చేపట్టేందుకు వీల్లేదంటూ టీడీపీకి చెందిన వెన్నపూస మాలకొండయ్య అడ్డుకోవడంతో వివాదం నెలకొంది. శుక్రవారం కొత్త గుడి నిర్మాణానికి పూజలు చేపట్టేందుకు గ్రామస్తులు సిద్ధం కాగా గుడి నిర్మాణం జరగాలంటే తాను చెప్పినట్లు వినాలని, లేకుంటే అడ్డుకుంటానని మాలకొండయ్య నానాయాగి చేయడంతో చేసేదేమి లేక పూజలను నిలిపివేశారు. తిరిగి ఆ స్థలంలోనే చిన్న పూజలు చేశారు. అయినప్పటికీ ఆదివారం జరగాల్సిన నిర్మాణ పనులను అడ్డుకుంటానని మాలకొండయ్య హెచ్చరించినట్లు గ్రామస్తులు వాపోయారు.

ఎంఈఓ తనిఖీలు

ఆత్మకూరురూరల్: బండారుపల్లి, దేపూరు ఎంపీయూపీ పాఠశాలలను ఎంఈఓ–2 చలపతి శుక్రవారం తనిఖీ చేశారు. బోధన, మధ్యాహ్న భోజనం అమలు తీరును పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు.

చెరువుల పనుల పరిశీలన

సీతారామపురం/ఉదయగిరి: సీతారామపురం మండలం చిన్నాగంపల్లి , ఉదయగిరి మండలం కృష్ణంపల్లి చెరువుల పనులను ఇరిగేషన్ ఈఈ వెంకటేశ్వర్లు శుక్రవారం పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. డీఈ చంద్రమౌళి, జేఈలు సురేష్, వేణు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

సంగం: స్థానిక ఎస్సీ వసతిగృహం వద్ద బైక్‌ను వెనుకగా వేగంగా టాటా ఏస్ వాహనం శుక్రవారం ఢీకొంది. ఈ ప్రమాదంలో టాటాఏస్‌లోని ఓ వ్యక్తితో పాటు బైక్‌పై ఉన్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భలే దొంగ

కావలి: ఓ దొంగ పాత హీరోహోండా బైక్‌ను అపహరించాడు..ఆ తరువాత పల్సర్ బైక్ కనిపించడంతో పాతబైక్‌ను అక్కడ వదిలి దాన్ని పట్టుకెళ్లాడు. ఈ ఘటన పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. వివరాలు.. పట్టణంలోని వడ్డిపాళెంలో ఓ వ్యక్తికి చెందిన పాత హీరో హోండా బైక్‌ను దొంగ అపహరించాడు. ఆ తరువాత దాన్ని వదిలేసి పల్సర్ బైక్‌ను అపహరించాడు. పాతూరు ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి తన పల్సర్ బైక్ అపహరణకు గురైందని, తాను బైక్ పెట్టిన స్థానంలో పాత హీరో హోండా బైక్ ఉందని కావలి వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు పాతబైక్‌ను స్టేషన్‌కు తీసుకురాగా వడ్డిపాళేనికి చెందిన వ్యక్తి తనదని రుజువులు చూపడంతో ఇచ్చేశారు. అంతిమంగా పల్సర్ బైక్‌ను దొంగ పట్టుకెళ్లినట్లుగా నిర్ధారణకు వచ్చి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మంచికంటి మృతిపై సంతాపం

సీతారామపురం: మండలంలోని బసినేనిపల్లిలోని మంచికంటి అనాథ ఆశ్రమ నిర్మాత మంచికంటి సుబ్రహ్మణ్యం మృతిపై పలువురు సంతాపం తెలిపారు. బసినేనిపల్లికి చెందిన మంచికంటి సుబ్రహ్మణ్యం వ్యాపారరీత్యా కర్నూలులో స్థిరపడ్డారు. సొంత ఊరిపై ఉన్న మమకారంతో కోటి రూపాయలకుపైగా వెచ్చించి వృద్ధులు, వితంతువులు, అనాథల కోసం ఆశ్రమాన్ని నిర్మించారు. హెల్త్ సెంటర్ నిర్మాణానికి లక్షలాది రూపాయల విలువజేసే తన రెండెకరాల భూమిని విరాళంగా అందజేశారు. జెడ్పీ హైస్కూల్‌లో సరస్వతి విగ్రహాన్ని నిర్మించారు. తన ఆశ్రమంలో ఎందరో అభాగ్యులకు వసతి కల్పిస్తున్న మంచికంటి కర్నూలులో బుధవారం మృతి చెందారు. ఆయన మృతితో గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి. ఆయన మృతిపై ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి, ఆశ్రమ నిర్వాహకుడు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చింతంరెడ్డి సుబ్బారెడ్డి, సీతారామపురం బిట్–1 ఎంపీటీసీ పీసీ అల్లూరురాజు ఓ సంయుక్త ప్రకటనలో సంతాపం తెలిపారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

సోమశిల: అనంతసాగరం మండలంలోని ఎరువులు, పురుగు మందుల, విత్తనాల దుకాణాలను నెల్లూరు ఏడీఏ శ్రీనివాసులు శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రెండు దుకాణాల్లో రూ.96,180 విలువైన ఎరువులు, రూ.16,420 విలువైన పురుగు మందులకు బిల్లులు లేకపోవడం గుర్తించి స్టాక్‌ను సీజ్ చేశారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి శ్రీధర్‌రెడ్డి ఉన్నారు.

నేడు గౌతమ్‌రెడ్డి జయంతి

మర్రిపాడు: దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి జయంతి వేడుకలను బ్రాహ్మణపల్లిలోని మేకపాటి నివాసంలో శనివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, మేకపాటి అభిమానులు హాజరుకావాలని కోరారు.

జేసీబీ అపహరణపై సీఐ దర్యాప్తు

అల్లూరు: అల్లూరులో జేసీబీని మంగళవారం రాత్రి అపహరించుకెళ్లిన ఘటనపై కావలి సీఐ పాపారావు శుక్రవారం అల్లూరు స్టేషన్‌కు చేరుకుని దర్యాప్తు చేపట్టారు. బాధితుడు మోషేష్‌ను పిలిపించి వివరాలను తెలుసుకున్నారు. త్వరలోనే దొంగను పట్టుకుంటామని హామీ ఇచ్చారు. సీఐ వెంట అల్లూరు ఎస్సై కిషోర్‌బాబు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

రైల్వే పోలీసు స్టేషన్ ఎస్సైగా రమాదేవి

కావలి : కావలి రైల్వే పోలీస్ స్టేషన్‌కు నూతన ఎస్సైను నియమిస్తూ గుంతకల్లు రైల్వే ఎస్పీ రాహుల్ మీనా గురువారం ఆదేశాలు జారీ చేశారు. బాపట్ల జిల్లాలో లా అండ్ ఆర్డర్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న ఐ రమాదేవిని కావలి రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్సైగా నియమించారు. ఈ మేరకు రమాదేవి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

నేడు మెప్మా ఆర్పీలకు శిక్షణ

ఆత్మకూరు: మెప్మా ఆర్పీలకు ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ అప్లికేషన్‌పై ఒక్క రోజు శిక్షణా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించనున్నట్లు మెప్మా టీఎంసీ జీ మాధవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలోని ఎంజీఆర్ సమావేశ మందిరంలో మెప్మా పీడీ నాగరాజకుమారి, మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే శిక్షణ కార్యక్రమానికి ఆర్పీలు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.